## డబ్బులు పంచుతున్న బీజేపీ కార్యకర్తల అరెస్ట్

బంజారాహిల్స్, నవంబర్ 28: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి చింతల రాంచంద్రారెడ్డిని గెలిపించాలంటూ ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్న ఇద్దరు బీజేపీ కార్యకర్తలపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని దీన్ దయాళ్‌నగర్‌కు చెందిన బీజేపీ కార్యకర్త ఎర్రబోతు మోహన్‌రావు(46), గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన మాగాని రాజు(22) కలిసి సోమవారం రాత్రి బీజేపీ అభ్యర్థి చింతలకు ఓటేయాలంటూ రూ.2వేలు చొప్పున ఓటర్లకు డబ్బు పంపిణీ చేస్తున్నారు. అదే సమయంలో సమాచారం అందుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దీన్ దయాళ్‌నగర్ బస్తీకి చేరుకుని నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.50వేల నగదు, ఓటర్ స్లిప్పులతో పాటు బీజేపీ అభ్యర్థి చింతలకు సంబంధించిన కరపత్రాలను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు.

## మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కేసు వాయిదా

నాంపల్లి కోర్టులు, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ) : మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై నమోదైన కేసు విచారణను వచ్చే నెల 21వ తేదీకి వాయిదా వేస్తూ 1వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి రమాకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. పిటిషనర్ రాఘవేంద్రరాజుతో పాటు అతడి న్యాయవాది గైర్హాజరు కావడంతో కోర్టు విచారణను వాయిదా వేసింది. ఈ కేసులో వరుసగా రెండోసారి విచారణను వాయిదా వేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఎంపీ, ఎమ్మెల్యే ప్రత్యేక కోర్టు ఉత్తర్వుల ప్రకారం మహబూబ్‌నగర్ 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఎఫ్ఐఆర్‌పై విచారణ చేపట్టిన పోలీసు అధికారులు.. తుది నివేదికను కోర్టుకు సమర్పించడంతో పిటిషనర్ ప్రొటెస్ట్ పిటిషన్ దాఖలు చేయడంతో మరోసారి కోర్టు విచారణ చేపట్టింది. మంత్రిపై ప్రైవేటు కేసు నమోదు చేసేందుకు ప్రత్యేక కోర్టుకు ఉన్న అధికారాల గురించి వివరించాలని కోర్టు ఆదేశించడంతో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు కోర్టుకు సమర్పించాల్సి ఉంది.

## జీహెచ్ఎంసీని సందర్శించిన పరిశీలకులు

సిటీబ్యూరో, నవంబరు 28 (నమస్తే తెలంగాణ ) : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు పోలీస్ జనరల్ పరిశీలకులుగా కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించిన ఐఏఎస్ అజయ్ వి.నాయక్, ఐపీఎస్ దీపక్ మిశ్రా మంగళవారం జీహెచ్ఎంసీని సందర్శించారు. వీరికి జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్, డిప్యూటీ ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లాకు కేటాయించిన పరిశీలకులతో ఎన్నికలపై పోలీస్ జనరల్ పరిశీలకులు సమీక్షించారు.

## మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

మేడ్చల్ కలెక్టరేట్, నవంబర్ 28: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె. జైన్ పూర్వాగార్డ్, అమన్ మిట్టల్, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ ఆధ్వర్యంలో ఎన్నికల సిబ్బందికి సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. జిల్లాలోని మేడ్చల్‌కు 584, మల్కాజిగిరి 429, కుత్బుల్లాపూర్ 590, కూకట్‌పల్లి 418, ఉప్పల్ 418 బృందాలను ఏర్పాటు చేశామని, శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 2,439 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి 12,510 మందిని మూడో విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశాన్నారు. అందులో 2,880 మంది పీవోలు, 2,860 మంది ఏపీవోలు 6,570 మంది ఓపీవోలు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- బరిలో 126 మంది అభ్యర్థులు
- వంద శాతం పోలింగ్‌కు చర్యలు
- జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, నవంబర్28 (నమస్తే తెలంగాణ): జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్ల వివరాలను కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలు, 16 విభాగాలకు ప్రత్యేకంగా 22 మంది నోడల్ అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల బరిలో 126 మంది అభ్యర్థులు ఉన్నట్లు చెప్పారు. జిల్లాలో మహిళా ఓటర్లకు ప్రత్యేకంగా నియోజకవర్గానికి 5 పోలింగ్ కేంద్రాల చొప్పున 25 పోలింగ్ కేంద్రాలు, దివ్యాంగులకు ఒకటి చొప్పున 5 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఫొటోతో ఉన్న ఓటర్ కార్డు లేదా.. ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డును తీసుకెళ్లాలని సూచించారు.


మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

| జిల్లాలో మొత్తం ఓటర్లు | |
|---|---|
| జిల్లాలో ఓటర్లు | –28,19,067 |
| పురుషులు | –14,59,629 |
| స్త్రీలు | –13,59,057 |
| థర్డ్ జెండర్ | –381 |
| జిల్లా వ్యాప్తంగా పోలింగ్ స్టేషన్లు | – 2397 |
| అర్బన్ పోలింగ్ స్టేషన్లు | – 2239 |
| రూరల్ పోలీస్ స్టేషన్లు | –158 |
| జిల్లాలో మహిళల ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు | – 25 |
| దివ్యాంగుల ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు | – 5 |
| పోలింగ్ సిబ్బంది | – 12,510 |
| మైక్రో అబ్జర్వర్స్ | – 200 |

## కౌంటింగ్ అబ్జర్వర్లకు శిక్షణ

సిటీబ్యూరో, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ): డిసెంబర్ 3వ తేదీన నిర్వహించనున్న 15 అసెంబ్లీ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియను కౌంటింగ్ అబ్జర్వర్లు సునిశితంగా పరిశీలించాలని జనరల్ అబ్జర్వర్ సమీర్ శర్మ తెలిపారు. మంగళవారం కౌంటింగ్ అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్, డిప్యూటీ డీఈఓ అనుదీప్ దురిశెట్టి, జనరల్ అబ్జర్వర్లు యతీంద్ర ప్రసాద్, జయకాంతన్, అహ్మద్ ఇక్బాల్, కవిత రాము, దీపాంకర్ సిన్హా, గాయత్రి కృష్ణన్, సచీంద్ర ప్రతాప్‌సింగ్ పాల్గొన్నారు. కౌంటింగ్ రోజు అబ్జర్వర్లు కౌంటింగ్ సూపర్‌వైజర్లు నిర్వహించే కౌంటింగ్‌ను పరిశీలించాలని తెలిపారు. దీంతో పాటు ప్రతి రెండు గంటలకు కంట్రోల్ యూనిట్‌లో నమోదయ్యే ఓట్లను నమోదు చేసి, కౌంటింగ్ సిబ్బంది డేటాతో పరిశీలించాలని, ఆ సమాచారాన్ని రిటర్నింగ్ అధికారులు, జనరల్ అబ్జర్వర్‌కు అందించాలని తెలిపారు. కౌంటింగ్ రోజు వరకు మరికొంత మంది అబ్జర్వర్లు వస్తారని సమీర్‌శర్మ చెప్పారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు ఫారం–17సీ ద్వారా అభ్యర్థుల ఓట్లను నమోదు చేయాలని పేర్కొన్నారు. కౌంటింగ్ రోజు అబ్జర్వర్లు పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌ను పరిశీలించి, నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్‌రాస్ తెలిపారు. ఎలక్ట్రానిక్ ట్రాన్స్ మీటర్ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునే ఆర్మీ పోలీసుల క్యూ ఆర్ కోడ్‌ను కూడా పరిశీలించి నమోదు చేయాలని తెలిపారు. కౌంటింగ్ రోజు 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నామని రొనాల్డ్‌రాస్ చెప్పారు. అభ్యర్థుల వారీగా ఓట్ల సంఖ్యను కంప్యూటర్‌లో నమోదు చేసేటప్పుడు అబ్జర్వర్లు పరిశీలించాలని తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో కౌంటింగ్ నిర్వహించడం జరుగుతుందని రొనాల్డ్‌రాస్ పేర్కొన్నారు.

## విధులను సమర్థవంతంగా నిర్వహించాలి

*పోలింగ్ శిక్షణ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ మంగతాయారు*

సిటీబ్యూరో, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ ) : విధులను ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జాయింట్ కమిషనర్ మంగతాయారు తెలిపారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి పోలింగ్ బూత్‌లో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు సహాయ అధికారులు ఉంటారని జాయింట్ కమిషనర్ మంగతాయారు తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, పీఓ డైరీ, ఫారం–17ఏ, 17సీ పరిశీలించి, నమోదు చేయాలని పేర్కొన్నారు. పీఓల వద్ద సంబంధిత పోలింగ్ స్టేషన్ ఓటర్ల జాబితా, ఏఎస్‌డీ లిస్ట్ కలిగి ఉండాలని సూచించారు. ఉదయం 5.30 గంటలకే పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్‌ను నిర్వహించాలని, 50 ఓట్లను వేసి వాటిని సీఆర్‌సీ ద్వారా క్లియర్ చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా వీవీ ప్యాట్ స్లిప్‌లను భద్రపర్చాలని చెప్పారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు బుధవారం సంబంధిత డీఆర్‌సీ సెంటర్లకు వెళ్లి , ఈవీఎంలను సేకరించుకొని నేరుగా పోలింగ్ కేంద్రానికి వెళ్లాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు చెక్ లిస్ట్ ఆధారంగా క్రమపద్ధతిలో తమ విధులను నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ విజయలక్ష్మి, మణిపాల్ ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రత్యామ్నాయ కార్డులు

పోలింగ్ రోజు ఓటర్లు ఎపిక్ కార్డుతో పాటు భారత ఎన్నికల సంఘం పలు కార్డులను సూచించింది. ఆధార్ కార్డు, పోస్టాఫీస్, బ్యాంక్ జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆర్‌జీఐ ద్వారా జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, ఫొటోతో కూడిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎంఎల్‌ఏ, ఎంపీ, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం, దివ్యాంగుల గుర్తింపు కార్డు.. ఏదైనా ఒక గుర్తింపు కార్డులను వెంట తీసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.

# ఎన్నికలకు పటిష్ట భద్రత

- 2.5 లక్షల వాహనాలు తనిఖీ
- రూ. 63 కోట్ల విలువైన నగదు, మద్యం స్వాధీనం
- ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు
- డయల్ 100కు ఫోన్ చేయండి
- ధైర్యంగా వచ్చి అందరు ఓటు హక్కు వినియోగించుకోండి
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్, సందీప్ శాండిల్య

సిటీబ్యూరో, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రశాంత వాతావరణంలో ఇన్స్‌డెంట్ ఫ్రీగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, ప్రతి ఒక్కరూ బయటకు వచ్చి ఓటు వేయాలని హైదరాబాద్ పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య సూచించారు. గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చట్టాన్ని ఎవరు అతిక్రమించినా.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 9వ తేదీ నుంచి వాహనాల తనిఖీ చేపట్టామని, 2.5 లక్షల వాహనాలను తనిఖీ చేసినట్టు తెలిపారు. ప్రతి రోజు నంబర్ ప్లేట్, డాక్యుమెంట్లు సరిగ్గా లేని 25 వాహనాల వరకు సీజ్ చేశామన్నారు. దీంతో పాటు అక్రమ రవాణాకు సంబంధించి రూ. 63 కోట్ల విలువైన నగదు, మద్యం సీజ్ చేశామన్నారు. 2400 నాన్ బెయిలబుల్ వారెంట్లు ఎగ్జిక్యూట్ చేసినట్టు తెలిపారు. నగరంలో ఉన్న 1600 మంది రౌడీషీటర్లను ప్రతిరోజు స్థానిక పోలీసులు తనిఖీ చేస్తున్నారని, ఎవరైనా అందుబాటులో లేకుంటే టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని వెంబడిస్తున్నారని వివరించారు. లైసెన్స్, వాహనాల డాక్యుమెంట్లు , హెల్మెట్ లేకుండా బయటకు వెళ్లొద్దని, తనిఖీల్లో పట్టుబడ్డ వాహనాలను సీజ్ చేసి ఎన్నికల తరువాత తిరిగి ఇస్తామన్నారు. ప్రతి రోజు 31 ప్రాంతాల్లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, పది రోజుల్లో 7000 మందిపై కేసులు నమోదయ్యాయన్నారు. నగరంలో ఉన్న 1700 పోలింగ్ కేంద్రాలలో.. 666 కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద సీఏపీఎఫ్ ఫోర్స్ ఉంటుందన్నారు. నగరంలో ఉన్న ఏడు జోన్లకు 40 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ బందోబస్తులో పాల్గొంటున్నట్టు తెలిపారు.

ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరు కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవొద్దని సీపీ సూచించారు. మీ కోసం మేమున్నాం.. ఏదైనా జరిగితే వెంటనే డయల్ 100కు కాల్ చేయాలన్నారు. స్థానిక పోలీసులకు, ఎన్నికల అధికారులకు కూడా సమాచారమివ్వాలన్నారు. వెంటనే చర్యలు తీసుకుంటారని సీపీ సూచించారు. ఎవరినైనా బెదిరించినా, బెదిరించే ప్రయత్నం చేసినా పోలీసులు వెంటనే అరెస్ట్ చేస్తారన్నారు. చిన్న ఘటన జరిగినా ప్రజలు భయపడే అవకాశం ఉంటుందని, ఫ్రీ ఫెయిర్ ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. చిన్న ఘటన జరిగినా ప్రజలు భయపడి ఓటింగ్‌కు దూరంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఎవరు కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. ఎవరైనా గొడవలు చేయలని ప్రయత్నిస్తే వెంటనే అరెస్ట్ చేసి, ఎన్నికల తరువాత విడిచిపెడుతామన్నారు. ఎన్నికలు ఒక పండుగలా జరుపుకోవాలని, వ్యక్తిగత విద్వేషాలకు పోవద్దని సూచించారు. ప్రతి ఒక్కరు ధైర్యంగా బయటకు వచ్చి ఓటెయ్యాలని, జిల్లాలో 80 శాతం వరకు పోలింగ్ జరుగుతుందని, అదే హైదరాబాద్‌లో 40 నుంచి 50 శాతం మాత్రమే ఉంటుందని, ఈ సారి అందరు ఓటు హక్కును వినియోగించుకొని ఓటింగ్ శాతాన్ని భారీగా పెంచాలని కోరారు.



## పోలింగ్ బూత్‌ల వద్ద 144 సెక్షన్

**సీపీ సందీప్ శాండిల్య**

సిటీబ్యూరో, నవంబర్ 28 (నమస్తే తెలంగాణ): పోలింగ్ స్టేషన్లకు చుట్టూ 200 మీటర్ల దూరం వరకు గుంపులు గుంపులుగా ఉండవద్దని, 144 సెక్షన్ అమలులో ఉంటుందని నగర పోలీస్ కమిషనర్ సందీప్ శాండిల్య తెలిపారు. 30వ తేదీ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ ఆంక్షలు నగరంలో అమలులో ఉంటాయన్నారు. అలాగే, కర్రలు, లాఠీలు, పేలుడు పదార్థాలు, ఆయుధాలతో తిరగడం నిషేధమని, పోలింగ్ స్టేషన్‌కు కిలో మీటర్ దూరం వరకు ఎవరు కూడా ఎక్కువ సంఖ్యలో గుంపులు గుంపులుగా ఉండకూడదన్నారు. తాత్కాలికంగా ఎలాంటి ఏర్పాట్లు కూడా పబ్లిక్ ప్లేసెస్‌లో చేయవద్దని, మైక్‌లు, మ్యూజిక్ సిస్టమ్, ప్రసంగాలు, నిషేధిత ఫొటోలు, సింబల్స్, ప్లకార్డులు, కులమత ద్వేషాలను రెచ్చగొడుతూ రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టి విధంగా ప్రసంగాలు చేయడంపై నిషేధాజ్ఞాలు విధించినట్లు తెలిపారు. అయితే, విధి నిర్వహణలో ఉన్న పోలీసు, మిల్టరీ, ఎలక్షన్ అధికారులు, సిబ్బందికి ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉన్నదని సీపీ పేర్కొన్నారు.